బల్కాపూర్ నాలాలో

పేరుకుపోతున్న వ్యర్థాలు

ఇటీవల కురిసిన వర్షానికి నాలా పొంగి ఇళ్లలోకి మురుగునీరు

- కొట్టుకు వచ్చిన వ్యర్థాలు
- ప్రమాదకరంగా నాలా గేట్లు
- వ్యర్థాలు తొలగించేందుకు వచ్చి పాడైన ఎక్స్‌కవేటర్
- గతంలో నాలాలోకి దిగి ఒకరు మృతి
- పట్టించుకోని అధికారులు

పంజాగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ నుంచి ఆనంద్‌నగర్, తుమ్మలబస్తీ మధ్య నుంచి బల్కాపూర్ నాలా ప్రవహిస్తోంది. భారీ వర్షాలు పడ్డప్పుడు పై నుంచి వచ్చిన వరదనీరు నాలా పై నుంచి ప్రవహిస్తోంది. ఖైరతాబాద్ ప్రధాన రహదారితో పాటు తుమ్మలబస్తీ, ప్రేమ్‌నగర్, ఆనంద్‌నగర్‌లలో మోకాలిలోతు నీరు నిలుస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నాలాలో పెద్ద ఎత్తున ఇసుక, మట్టి పేరుకుపోయింది. నాలాలో పూడిక తీసేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్ వర్షం నీటిలో మునిగి పాడైంది. నాలా నుంచి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖైరతాబాద్ ప్రధాన రహదారి నుంచి తుమ్మలబస్తీకి వెళ్లే మార్గంలో బ్రిడ్జి కింద వ్యర్థాలు గుట్టలా పేరుకుపోయాయి. గతంలో ఇదే ప్రాంతంలో నాలాలోకి దిగి వ్యర్థాలను ఏరుకునే క్రమంలో ఓ వ్యక్తి ఆ వ్యర్థాల మధ్యన ఇరుక్కుని మృతి చెందినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్స్ కవేటర్ నాలాలోకి దిగి వ్యర్థాలను తొలగించేందుకు రెండు గేట్లు ఏర్పాటు చేశారు. అవి ప్రమాదకరంగా మారాయి. ఒక గేటును పూర్తిగా తెరిచి ఉంచగా, మరో గేటు కింద జాలి లేక ప్రమాదకరంగా ఉంది. జాలి లేకపోవడంతో భారీ వర్షం పడితే అందులో ఎవరైనా జారి పడే ప్రమాదం పొంచి ఉంది. నాలా పక్కనే ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది.

నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ పాఠశాలకు వస్తుంటారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఖైరతాబాద్ వద్ద బల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు



గేటు కింద జాలి లేకపోవడంతో పొంచి ఉన్న ప్రమాదం



నాలాను సగానికి పైగా ఆక్రమించిన మట్టి, రాళ్లు, వ్యర్థాలు



నాలాలో పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలు

జాగ్రత్తలు పాటిస్తే అగ్నిప్రమాదాల నివారణ

- ఎమ్మెల్యే తలసాని



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తగిన జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నేటి నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, లీడ్ ఫైర్ ఆఫీసర్ రాజు, సిబ్బంది రాజశేఖర్, అర్జున్, ప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకుడు టి.శ్రీహరి పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న తలసాని, కవిత

సిక్కుల పవిత్ర పండుగ వైశాఖీ

అమీర్‌పేట/బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సిక్కులు అత్యంత పవిత్రంగా జరుపుకునే గొప్ప పండుగ వైశాఖీ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. వైశాఖీ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన విశాల్ దివాస్, నగర కీర్తన కార్యక్రమానికి వారు ఆదివారం హాజరయ్యారు. గురుగోవింద్‌సింగ్ ప్లేగ్రౌండ్‌లో సిక్కులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల క్షేమం కోసం ఖల్సాపంత్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిక్కుల జీవనశైలి, ధైర్య సాహసాలు ఎంతో గొప్పవన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, టిల్లుబాయ్, సుమిత్‌సింగ్, లక్ష్మి, రాణి కౌర్ పాల్గొన్నారు. వైశాఖీ పండుగ సిక్కు సమాజానికి గౌరవ ప్రదమైనదని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని మున్సిపల్ గ్రౌండ్‌లో అమీర్‌పేట గురుద్వార్ ఆధ్వర్యంలో జరిగిన వైశాఖీ వేడుకలకు ఆమె హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సురేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువవికాసం దరఖాస్తుల గడువు పొడిగించాలి'

బోరబండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం దరఖాస్తుల గడువు పొడిగించాలని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన వారికి ఆదివారం లేఖలు రాశారు. రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగ యువతకు ఆశాజ్యోతి కలిగించిన రాజీవ్ యువవికాసం పథకం కోసం దరఖాస్తు గడువు 14వ తేదీతో ముగుస్తున్నదని, ఈ గడువును మరో 10 రోజులు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అశ్వినిసేతి

వ్యవసాయంలో కృత్రిమ మేధతో ఎన్నో లాభాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో కృత్రిమ మేధను ఉపయోగిస్తే అధిక దిగుబడి వస్తుందని గురుకాశీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ అశోక్‌సేతీ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏఐపై అవగాహన కల్పిస్తే దిగుబడి అధికంగా పెంచుకొని లాభసాటిగా మార్చుకోవచ్చని తెలిపారు. పంజాబ్‌లోని గురుకాశీ విశ్వవిద్యాలయంలో ఏఐ ఆధారంగా అగ్రికల్చర్ బీఎస్సీతో పాటు బీటెక్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులను చైతన్యపర్చేందుకు విద్యార్థులను తీర్చిదిద్దేలా తమ విశ్వవిద్యాలయం శిక్షణ ఇస్తోందన్నారు. ఏఐకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, దానికి అనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించి విద్యార్థులకు ఆధునిక శిక్షణ ఇస్తున్నట్లు మ్యాస్ట్రో డైనమిక్ సీఈఓ భావన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఇచ్చేలా పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గురుకాశీ విశ్వవిద్యాలయం ప్రతినిధులు సింధూజ, కృష్ణారెడ్డి తెలిపారు.

విలువలు గల సమాజం కోసం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్‌గౌడ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చిన్న పిల్లల నుంచి ముసలి వారి వరకు మహిళలపై అత్యాచారాలు, వేధింపులు నిత్యకృత్యమయ్యాయని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎర్రమంజిల్‌లోని సేవ్ ది గర్ల్‌చైల్డ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కళాశాల యువత మహిళలను గౌరవించేలా మంచి విలువలు గల సమాజం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజేంద్ర పల్నాటి, మారియా ఆంథోని, గీతానంద్, శరణ్య, అపర్ణ, సునీత, ప్రియాంక, కొన్నె దేవేందర్, రమేష్‌బాబు, వి.గంగాధర్, హరిప్రకాష్, ప్రశాంత్, వంశీకృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

బోరబండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను బోరబండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలు మూసి ఉండడంతో ఇందిరానగర్‌లో గుంజ రమణ(45) మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 180 ఎంఎల్ ఐఎంఎఫ్‌ఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) 12 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బోరబండలో నిర్వహించిన ఊరేగింపులో క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

బోరబండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు శిలువ శిక్షకు గురయ్యేందుకు ముందు వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు మట్టల ఆదివారంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జెరుసలేం పట్టణంలో ఏసుప్రభు జయప్రవేశం సందర్భంగా 2025 ఏళ్లక్రితం అక్కడి ప్రజలు ఖర్జూరచెట్టు మట్టలతో ఆయనకు ఘనస్వాగతం పలికిన సందర్భాన్ని పురస్కరించుకొని బోరబండ సైట్-2 కాలనీ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చి ఆధ్వర్యంలో ఈత మట్టెలతో ఊరేగింపు నిర్వహించారు. 'యూదుల రాజుకు జై' అని నినదిస్తూ చిన్నారులు, పెద్దలు పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. సైట్-2 కాలనీ చర్చి నుంచి మొదలైన మట్టల ఊరేగింపు బోరబండ కూడలి వరకు కొనసాగింది. మెస్సయ్య వస్తున్నాడని బైబిల్‌లో సూచించిన లేఖనాలను నిజంచేస్తూ ఏసుక్రీస్తు జెరూసలేం ప్రవేశం జరిగిందని చర్చికి చెందిన ఫాదర్ అలెక్స్, ఫాదర్ విల్సన్ తెలిపారు. చర్చి ప్రతినిధులు విక్టర్, రాబిన్, జాకబ్, యూజిన్, క్లైమెంట్, లారెన్స్, విజయ్, అలెక్స్, ఆంథోనీపాల్, వరప్రసాద్, రమేష్, బెంజమిన్ డైస్, బోరబండ డివిజన్ క్రైస్తవ నాయకుడు నాగారపు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. మట్టల ఊరేగింపు అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఎల్‌ఈఎఫ్ చర్చిలో మట్టలతో చిన్నారుల ప్రదర్శన

ఎల్‌ఈఎఫ్ చర్చిలో..

ఖైరతాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఎల్‌ఈఎఫ్ చర్చిలో చిన్నారులు మట్టలు పట్టుకొని యేసును స్తుతిస్తూ ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు కీర్తనలు ఆలపించారు. పాస్టర్లు మట్టల ఆదివారం ప్రాధాన్యతను తెలుపుతూ సందేశం ఇచ్చారు.



వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ జరిగిన ర్యాలీలో విజయారెడ్డి, షరీఫ్ తదితరులు

వక్ఫ్ సవరణ బిల్లుపై పునరాలోచించాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును కాంగ్రెస్ పార్టీతో పాటు ముస్లింలందరూ వ్యతిరేకిస్తున్నారని, దీనిపై పునరాలోచించాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వక్ఫ్ బచావ్ ప్రధాన ర్యాలీ అనంతరం ఎంఎస్‌మక్తాకు చెందిన ముస్లింలతో కలిసి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ మార్గంలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం మీదుగా ఎంఎస్ మక్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్‌కె షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్ వద్ద జరిగిన 'వక్ఫ్ బచావ్' మార్చ్ కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ఖమర్ హమీద్, ఎ బ్లాక్ ప్రెసిడెంట్ నస్రీన్ తదితరులు

- బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)

తవ్వారు.. వదిలేశారు..

అండర్ గ్రౌండ్ కేబుల్ వేసి మరమ్మతులు మరచిన అధికారులు

బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని ఎయిర్‌లైన్స్ కాలనీలో నెల రోజుల క్రితం విద్యుత్ అధికారులు అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను నిర్వహించారు. ఈ క్రమంలో ఇటీవలే వేసిన సీసీ రోడ్డును తవ్వి కేబుల్ పనులను నిర్వహించారు. పనులు పూర్తయి నెలలు గడిచినా తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. అక్కడ గుంతలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల గ్రీన్‌ల్యాండ్ ఏడీఈని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వెంటనే రహదారికి మరమ్మతులు చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.



అండర్ గ్రౌండ్ కేబుల్ వేసి రోడ్డుకు మరమ్మతులు చేయని ఎయిర్‌లైన్స్ కాలనీ రోడ్డు

వరంగల్ సభను విజయవంతం చేయండి

- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్

బంజారాహిల్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవం సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం రజతోత్సవ సభకు సంబంధించిన జనసమీకరణ, తదితర అంశాలపై బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసోజు మాట్లాడుతూ అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా పదేళ్ల పాలనలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రజలు ఏడాదిన్నర కాంగ్రెస్ పార్టీ పాలనతో విసిగిపోయారన్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు మితిమీరిపోయాయని, భూకబ్జాలు, బెదిరింపులు చేస్తూ సామాన్యులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. హైడ్రా పేరుతో రియల్ ఎస్టేట్ రంగాన్ని కుప్పకూల్చారని, గచ్చిబౌలి భూముల విషయంలో మూగజీవాలను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు.



వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్

సమావేశంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెల్దండ వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు మహేష్‌యాదవ్, హేమలతయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఆటిజంపై అవగాహన ఉండాలి

దివీస్ ఎండీ డాక్టర్ మురళి

బంజారాహిల్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆటిజం(బుద్ధిమాంద్యం)పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని, సరైన సమయంలో గుర్తించడం, సరైన చికిత్సలు అందించడం ద్వారా దీనిని అధిగమించవచ్చునని దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ఎండీ డాక్టర్ మురళి కే. దివీ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్, ఫెర్నాండేజ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా ఆటిజం అవగాహన నడకను నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారిని సాధారణ పిల్లల మాదిరిగా మార్చేందుకు తాము పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్‌ను ఆటిజం అవగాహన మాసంగా జరుపుకుంటున్నారని దివీస్ డైరెక్టర్ నీలిమా దివి అన్నారు. తాజా అధ్యయనాల ప్రకారం, ప్రతీ 68 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం లక్షణాలు కనిపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుందని ఫెర్నాండేజ్ డాక్టర్ ప్రమోద్ తెలిపారు. ఆటిజంపై తాము ఐదు సంవత్సరాలుగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ ఉపాధ్యక్షులు ప్రకాశ్ దివీ, మధుబాబు, జీఎంలు సుబ్బారావు, బి.వరప్రసాద్, జె.మనోరంజన్, దివీస్ సంస్థకు చెందిన సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్కు వద్ద ఆటిజంపై అవగాహన కార్యక్రమంలో దివీస్ ఉద్యోగులు



వీర హనుమాన్ ఆలయంలో జరిగిన పూజల్లో డా.కోట నీలిమ

వీరహనుమాన్ ఆలయంలో భజన

బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని శ్రీ వీర హనుమాన్ ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నేత విశాల్ సుధాం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీస్ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్‌శర్మ, పూజారి భద్రీనాథ్‌శర్మ పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి'

పంజాగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర చారిత్రాత్మకమైనదని, వారిని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి, వారు ఎదుర్కొంటున్న అన్నిరకాల సమస్యలను పరిష్కరించాలని వక్తలు, సీనియర్ జర్నలిస్టులు, తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్(టీజేఎఫ్), తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ(టీయూజేఏసీ)ల ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం జరిగింది. ఫ్రంట్ అధ్యక్షుడు మోహన్ బైరాగి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో రాష్ట్రంలోని 16 సంఘాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, డెస్క్, ఫోటో, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు. వివిధ అంశాలపై చర్చించి పలు తీర్మానాలను ప్రతిపాదించగా వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. జర్నలిస్టుల సంక్షేమ బోర్డు, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, కంట్రిబ్యూటర్, స్ట్రింగర్‌లకు గౌరవ వేతనం ఇవ్వాలని, రైల్వేపాస్‌ను వెంటనే పునరుద్ధరించాలని, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించాలని, టెలికాస్ట్ అవుతున్న చానల్ లో పనిచేసే ప్రతి జిల్లా, గ్రామస్థాయి విలేకరికి, ప్రతీ వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్, హెల్త్‌కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, సినీదర్శకుడు రఫీ, డాక్టర్ వెంకటేశ్వర్లు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, తెలంగాణ ఉద్యమకారులు కప్పర ప్రసాద్, ఇంద్రవెల్లి రమేష్, ఇస్మాయిల్, ముతేష్, గిరిరాజ్, ఆనంద్ రామస్వామి,వి.రవీందర్‌రెడ్డి, ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక ప్రతినిధులు ఎ.యాదగిరి, డోలక్ యాదగిరి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆట,పాట సభికులను ఆకట్టుకున్నాయి.



మట్టల ఆదివారం ర్యాలీని ప్రారంభిస్తున్న సర్వే సత్యనారాయణ

సెక్యులర్ వాదానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

● సర్వే సత్యనారాయణ

సికింద్రాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అన్ని మతాలను సమానంగా చూస్తూ సెక్యులర్ వాదానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్యాంసన్‌రాజు ఆధ్వర్యంలో రసూల్‌పురాలో నిర్వహించిన మట్టల ఆదివారం ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే ముందు ఏసుక్రీస్తు తిరిగి భూలోకానికి వచ్చిన రోజును మట్టల ఆదివారంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ తిరిగి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శ్యాంసన్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా తాము మట్టల ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నామని, కంటోన్మెంట్ వ్యాప్తంగా క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొనడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్పిడి గోపాల్, ఎస్.రాజేష్‌యాదవ్, అన్నానగర్ మురళి తదితరులు పాల్గొన్నారు. ప్లకార్డులతో పెద్ద ఎత్తున పాస్టర్లు, క్రైస్తవులు ర్యాలీని కొనసాగించారు.



బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న నాయకులు

ప్రతి పైసా పేద బిడ్డలకు అందిస్తా

సికింద్రాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ముదిరాజ్ కార్పొరేషన్‌కు వచ్చే ప్రతి పైసా ముదిరాజ్ పేదబిడ్డలకే అందిస్తానని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని టివోలీ గార్డెన్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ముదిరాజ్‌లకు ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. కోకాపేట్‌లో ఉన్న ఐదు ఎకరాల స్థలంలో ముదిరాజ్ భవన్‌ను కట్టిస్తానని తెలిపారు. తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం గౌరవాధ్యక్షుడు బలరాం, అధ్యక్షుడు చింతల నీలకంఠం, ప్రధాన కార్యదర్శి బోయిన శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గడ్డమీద శ్రీశైలం, గోనెల కుమార్, ఇండస్ట్రీ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి మండపారాధన చేస్తున్న ఈఓ మహేందర్ రెడ్డి

ముగిసిన హనుమాన్ జయంతి వేడుకలు

తిరుమలగిరి ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో ఈఓ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. మండపారాధనలో భాగంగా స్వామి వారికి పూజలు నిర్వహించారు. జై శ్రీరామ్..... జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవి.బాలరాజు, జీవి.వినోద్, రాజు, ప్రేమ్, యేసు బాబులు పాల్గొన్నారు.



మట్టలతో ర్యాలీ



బొల్లారం హోలీ ట్రినిటీ చర్చిలో ఆదివారం మట్టలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమలగిరి (ఆంధ్రజ్యోతి)



మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలికిన ముప్పిడి గోపాల్

వెంకటరమణ కాలనీని సందర్శించిన టీపీసీసీ చీఫ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం రాత్రి కంటోన్మెంట్‌లోని వెంకటరమణ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు జరిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులతో సమావేశమయ్యారు. బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. రవికుమార్, పరమేష్, నరేష్, సదానంద్, సరిత, ముకుందన్, సంతోష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా నర్సింగ్‌రావు



నర్సింగ్‌రావు

అడ్డగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా తుకారాంగేట్‌కు చెందిన బక్కూరి నర్సింగ్‌రావు నియమితులయ్యారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో పార్టీ కోసం, ప్రజా సమస్యలపై శ్రమించిన ఆయనను ఇన్‌చార్జిగా నియమించడంపై బీఎస్పీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ రోడ్డుపై వెళ్లేదెలా..

● ఆర్‌ఆర్‌సీ మైదానం దగ్గర సీసీ రోడ్డు వేయాలి
● ఈప్రాంత వాసులకు బస్టాప్ దూరం



చెత్త కుప్పలుగా మారిన మట్టిరోడ్డు



అడ్డగుట్ట బస్తీ

అడ్డగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్ పరిధిలో ఉన్న ఆర్‌ఆర్‌సీ మైదానం వద్ద సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి అడ్డగుట్టకు రావాలంటే ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్ కారణంగా మరో కిలోమీటర్ దూరం నుంచి అడ్డగుట్టకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో పది నిమిషాల్లో అడ్డగుట్టకు చేరుకునేవారు, ఇప్పుడు దాదాపు అరగంట సమయం పడుతోందని వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసుల వన్‌వే నిబంధనల వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 43,365 మంది జనాభా నివసించే డివిజన్‌లో ఆర్టీసీ బస్సుల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త రోడ్డు వేయండి

సికింద్రాబాద్ రైల్ నిలయం వెనుక నుంచి ఈస్ట్ మారేడుపల్లి ఆర్‌ఆర్‌సీ మైదానం మీదుగా పహాడి హనుమాన్ ఆలయం వరకు మట్టిరోడ్డు ఉంది. ఇక్కడ సీసీ రోడ్డు వేస్తే అడ్డగుట్ట తుకారాంగేట్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాల రాకపోకలకు సగం ప్రయాణం సమయం తగ్గిపోతుంది. అడ్డగుట్ట రెండు వైపులా దారులు ఉన్నాయి. ఆర్‌ఆర్‌సీ మైదానం మీదుగా సీసీ లేదా తారురోడ్డు వేస్తే ఆర్టీసీ బస్సులు, ఆటోలు రాకపోకలు సాగించవచ్చు. మట్టిరోడ్డుకు మరమత్తులు చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.




మొండిబండనగర్ బస్తీ నుంచి పహాడి హనుమాన్ ఆలయం వరకు వెళ్లే మట్టిరోడ్డు

ఇబ్బందికర ప్రాంతాలు

- తుకారాంగేట్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే మారేడుపల్లి మీదుగా వెళ్లాల్సివస్తోంది.
- అడ్డగుట్ట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే అడ్డగుట్ట కమ్యూనిటీ హాలు మీదుగా ఈస్ట్‌మారేడుపల్లి రైల్ నిలయం మీదుగా వెళ్లాలి.
- తుకారాంగేట్ - మరాఠబస్తీ మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే సులువుగా ఉంటుంది. కానీ మట్టి రోడ్డు. వెళ్లలేని పరిస్థితి
- లాలాగూడ నుంచి మెట్టుగూడ మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం.
- తుకారాంగేట్ నుంచి ఈస్ట్‌మారేడుపల్లి షేనాయక్ నర్సింగ్ హోం సంగీత్‌చౌరస్తా, సికింద్రాబాద్ కీస్ హైస్కూల్ వైపు వెళ్లాలంటే అరగంట సమయం పడుతోంది.
- సికింద్రాబాద్ నుంచి అడ్డగుట్టకు రావాలంటే సంగీత్ చౌరస్తా రైల్ నిలయం వెళ్లేదారిలో ఎడమ వైపు రత్నదీప్ సూపర్‌మార్కెట్ మీదుగా వెళ్లాలంటే సమయం వృథా అవుతోంది.

30 ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి



సికింద్రాబాద్‌కు బస్సులో వెళ్లాలంటే కిలోమీటర్ దూరం వరకు రావాలి. అదే ఆర్‌ఆర్‌సీ మైదానం నుంచి సికింద్రాబాద్‌కు ఆర్టీసీ బస్సులు నడిపితే తక్కువ సమయంలో వెళ్లవచ్చు. లేదంటే సీసీ రోడ్డు వేసి ఆర్టీసీ బస్సులు నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ముప్పై ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉంది. నేతలు మారుతున్న అడ్డగుట్ట తలరాతలు మాత్రం మారడంలేదు.

- బక్కూరి నర్సింగ్‌రావు (బీఎస్పీ)

బస్టాపు దూరం..



సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే ఆటోలు లేదా ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాల్సి వస్తోంది. బస్టాప్‌కు రావడానికి కిలోమీటర్ నడవాలి.

ఆర్‌ఆర్‌సీ మైదానం మొండిబండనగర్ బస్తీ(లోహియనగర్) మీదుగా ఉన్న మట్టిరోడ్డుకు మరమత్తులు చేసి కొత్త సీసీ రోడ్డు వేయాలి. కొత్త రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రోడ్డు నిర్మిస్తే సులువుగా ట్రాఫిక్ సమస్య లేకుండా సికింద్రాబాద్‌కు వెళ్లవచ్చు.

- సంగీత, కాంగ్రెస్ సేవాదళ్ ప్రతినిధి

కిలోమీటర్ నడవాల్సిందే



లోహియనగర్ వాసులు సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే కిలోమీటర్ దూరంలో ఉన్న తుకారాంగేట్ లేదా అడ్డగుట్ట బస్టాపుకు రావాల్సిందే. అదే ఆర్‌ఆర్‌సీ మైదానం రోడ్డు నుంచి సికింద్రాబాద్‌కు సీసీ రోడ్డు వేస్తే ఐదు నిమిషాల్లో సికింద్రాబాద్ కు చేరుకోవచ్చు. ఆర్‌ఆర్‌సీ మైదానం రోడ్డులో సీసీ రోడ్డు వేసి బస్సులు నడిపితే బాగుంటుంది.

- సువర్ణ, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి

అన్ని డివిజన్లలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఖరితో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులపాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశం తలసాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఏర్పడిన పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ పండుగను ఈ నెల 27వ తేదీన ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. 27న అన్ని డివిజన్లలో జెండాలను ఆవిష్కరించాలని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరిగే నార్టీ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. 15 నెలల పాలనతోనే అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంతో విసిగిపోయారని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మీ, కుర్మా హేమలత, టి.మహేశ్వరి, డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి 20వరకు అగ్ని మాపక వారోత్సవాలు

మారేడుపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించవచ్చని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, లీడ్ ఫూర్ ఆఫీసర్ రాజు, సిబ్బంది రాజశేఖర్, అర్జున్, ప్రసాద్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పగలే వెన్నెల

బేగంపేట బ్రాహ్మణవాడి లేన్ నెంబరు.6లో పగలు వెలుగుతున్న వీధిలైట్.

- బేగంపేట, (ఆంధ్రజ్యోతి)



'వక్ఫ్ బచావ్' మార్చ్

ట్యాంక్‌బండ్ వద్ద జరిగిన "వక్ఫ్ బచావ్" మార్చ్ కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఖమర్ హమీద్, ఎ బ్లాక్ ప్రెసిడెంట్ నస్రీన్ తదితరులు.

- బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)

వాడవాడలా అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు క్షీరాభిషేకం



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన కార్పొరేటర్ కొంతం దీపిక

● శుద్ధి చేసి నివాళులర్పించిన బీజేపీ శ్రేణులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యంలో భాగస్వాములైన మహనీయుల విగ్రహాలను శుద్ధి చేయాలంటూ బీజేపీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపుకు ఆదివారం లష్కర్ బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్పందించాయి. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయా ప్రధాన కూడళ్లు, కాలనీలు, బస్తీల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పాలతో శుద్ధి చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బౌద్ధనగర్ డివిజన్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, నాగమణిల ఆధ్వర్యంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు బీజేపీ నాయకులు కార్యకర్తలు క్షీరాభిషేకం చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. మేకల కీర్తి హర్షకిరణ్, హనుమంతు ముదిరాజ్, కొమరయ్య, సాయదత్తు, సురేష్, అరవింద్, వనమాల, శ్రీనివాస్, నాగరాణి, మమత, సుప్రియ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. మోండా మార్కెట్ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్‌లో స్థానిక బీజేపీ కార్పొరేటర్ కొంతం దీపిక డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. కంటోన్మెంట్‌లోని కార్ఖాన, పికెట్, బొల్లారం ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ క్షీరాభిషేకం చేశారు. డాక్టర్ అంబేడ్కర్ గొప్పతనాన్ని పార్టీ శ్రేణులకు వివరించారు. కార్యక్రమంలో జె.వి.నర్సింగ్‌రావు, ధనుంజయ చారి, టోపీ శంకర్, విజయానంద్, సతీష్ పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యంలో భాగస్వాములైన మహనీయుల విగ్రహాలను శుద్ధి చేయాలంటూ బీజేపీ కేంద్రకమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం సీతాఫల్‌మండిలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి క్షీరాభిషేకం చేసి, పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భరత్‌గౌడ్, మేకల సారంగపాణి, బండ కార్తీకరెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, హరి, మేకల కీర్తి తదితరులు పాల్గొన్నారు.



కార్ఖానలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ

మారేడ్‌పల్లిలో..

అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు పికెట్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి క్షీరాభిషేకం చేసి ఆయనను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తిలక్ వంశీ, వార్డు పూర్వ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించిన కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, బి.ఎన్.శ్రీనివాస్ తదితర బీజేపీ నాయకులు

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)





వీర హనుమాన్ ఆలయంలో జరిగిన పూజల్లో డా.కోట నీలిమ

వీర హనుమాన్ ఆలయంలో భజన

బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని శ్రీ వీర హనుమాన్ ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నేత విశాల్ సుధాం అధ్వర్యంలో హనుమాన్ చాలీస్ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్‌శర్మ, పూజారి భద్రీనాథ్‌శర్మ పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాటుకు వినతి

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. శివశంకర్, ఈ కార్యక్రమంలో ఆలకుంట హరి, సంపత్ కుమార్, నరేష్, సదానంద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- (రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి)



హనుమాన్ ఆలయంలో పూజలు

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం తుకారాంగేట్ పహాడి హనుమాన్ ఆలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ కార్తీకారెడ్డి, సీతాఫల్‌మండి మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్‌లు పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్, ఉదయ్ యాదవ్, శివాజీ, రాజు, వీరు తదితరులు పాల్గొన్నారు.

- (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

తవ్వారు.. వదిలేశారు



అండర్ కేబుల్ వేసి రోడ్డుకు మరమ్మతులు చేయని ఎయిర్‌లైన్స్ కాలనీ రోడ్డు

బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని ఎయిర్‌లైన్స్ కాలనీలో నెల రోజుల క్రితం విద్యుత్ అధికారులు అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను నిర్వహించారు. ఈ క్రమంలో ఇటీవలే వేసిన సీసీ రోడ్డును తవ్వి కేబుల్ పనులను నిర్వహించారు. పనులు పూర్తయి నెలలు గడిచినా తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. అక్కడ గుంతలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల గ్రీన్‌ల్యాండ్ ఏడీఈని కలిసి వినతిపత్రం ఇచ్చారు. రహదారికి మరమ్మతులు చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.

వైశాఖి పండుగ సమైక్యతకు ప్రతీక



గురు గోవింద్ సింగ్ మైదానంలో జరిగిన వైశాఖి వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైశాఖి పండుగ సిక్కు సమాజానికి గౌరవ ప్రదమైనది. ఇది ఆధ్యాత్మికత, భక్తి, సమైక్యతకు ప్రతీక అని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. అమీర్‌పేటలోని ధరంకరం రోడ్డులో గల మున్సిపల్ గ్రౌండ్‌లో అమీర్‌పేట గురుద్వార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నీలిమ పాల్గొన్నారు. ఆమె ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సురేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.